# సుడిగాలి

వంకకు అవతల చవిటి బీళ్లల్లో సుడిగాలి లేచింది. ఎండుటాకులూ, ఊపటొండూ, చెత్తా చెదారాన్ని తనతోబాటు పైకిలేపి ఒక వికృతాకారాన్ని పొందుతూ సురసురమని సుడిదిరుగుతూ వంకలోకి దిగింది. అక్కడ జంబు గుముల మీదబడి కంకుల్ని పగుల గొట్టి, దూదిని పైకి లేపుతూ గట్టున్నే వున్న వడ్ల కళ్లంలోకి జొరబడింది.

సుడిగాలి మొహానికి కొట్టకముందే తూరుపెత్తుతూవున్న చేటలోని వడ్లగింజల్ని అలాగే రాశిమీద పోసి చేటను అడ్డుంచుకొన్నాడు ఓబన్న.

అందిస్తూవున్న వడ్ల చేటను కిందపడేసి "అమ్మో! వొచ్చె వొచ్చె నా సవితి..." అంటూ ఆదరా బాదరా పరుగెత్తి వరిగడ్డిలో ఆడుకొంటూ వున్న పిల్లలిద్దర్నీ జవురుకొని గుండెల్లో పొదువుకొని పైట చెరగు కప్పింది బాలమ్మ.

తూరుపెత్తిన తాలునంతా తిరిగి మేలు గింజల రాశిలో కలిపి, దుగ్గదుశానాన్ని రాశినిండా, కళ్లం నిండా నెరపి మెల్లిగా గట్టెక్కింది సుడిగాలి.

"థూ...థూ..." కేకరించి వూస్తూ లేచింది బాలమ్మ.

"యాడున్నెవే నా సవితిముండా!" అంటూ సుడిగాలికేసి తిరిగి మెటికలు విరిచింది.

ముందుకు సాగిపోతోన్నదల్లా కొద్దిసేపు ఆగి అక్కడే తిరగసాగింది సుడిగాలి.

అటుఇటు వెంపర్లాడి కళ్లానికి చివర దొరికిన పాతచెప్పు తీసికొంది బాలమ్మ. చెప్పుమీద మూడుసార్లు ఎంగిలివూసి "సావులంజా!" అంటూ సుడిగాలికేసి విసిరింది.

మెల్లిగా అక్కణ్నుంచి కదిలి, ఆగి ఆగి వెనక్కి చూస్తోన్నట్లే సాగిపోయింది గాలి. అది దూరమయ్యేదాకా ఆమె తిడుతూనే వుంది. పిల్లలు కూడా ఆమెకు తోడయ్యారు.

సుడిగాలి చేసిన చెరుపును సరిదిద్దికొనేసరికి గంటకు పైగా పట్టింది. బందెర పుల్లలతో చెత్తా చెదారాన్నంతా పక్కకు తోశారు. చేతి బలాన్నంతా ఉపయోగించి రాశిమీద చేటపాలి విసరి తాలును లేవగొట్టారు. రాశి మొదళ్ల దగ్గర్నుంచి తెంచుతూ దండెకట్టును వేరుజేసి మళ్లీ మళ్లీ తూరుపెత్తారు.

అప్పటికే పొద్దు వాటాలింది.

గెనిమల మీద మేసి వంకలో నీళ్లు తాగి చెట్లకింద పడుకొని వున్నాయి ఎద్దులు.

తలను కప్పి గడ్డం కిందుగా ముడేసి వున్న తుండుగుడ్డను విప్పి రెండుసార్లు జాడించి దానితోనే వొళ్లంతా విదిల్చుకొంది బాలమ్మ. తనచుట్టూ గాల్లోకి లేచిన వరిదువ్వలోంచే చుట్టూ పారజూసింది.

రేగుకంపలో వేళ్లు జొనిపి పళ్లు కోసుకు తింటున్నారు పిల్లలిద్దరూ. ఆకలిగొన్నారు కాబోలు.

"సుజాతా! రాండి..రాంగ్రా! బువ్వ తిందాం రాంగ్రి." పిల్చింది.

గట్టుమీద వేపచెట్టు కిందకు నడిచింది.

బోర్లించివున్న గంపమీది బండను కిందకు తోసి గంప ఎత్తింది.

బుట్టలోని సద్దిగుడ్డ మీది ఎ్రఱ్రజీమల బారును చూసి ఉలిక్కి పడుతూ గుడ్డను తొలగించింది.

తెల్లని అన్నం నిండా ఎ్రఱ్రజీమల మంద. గిన్నెలోని మజ్జిగ మట్టు మీద పేరుకొని వున్న వెన్న జిడ్డు నిండా ఎ్రఱ్రజీమల దండు. మజ్జిగ నిండా తేలుతోన్న ఎ్రఱ్రజీమలు.

"చొ..చొ...చొ..." బాధగా చప్పుడు చేసింది. "ఎండాకాలమట్టా పట్టినయే - వీటి మాడుపగలా!" అంటూ బుట్టను ఎండలోకి తీసికెళ్లి నేలమీద తట్టోడిసింది.

రాలిన చీమలన్నీ రాలిపోగా మిగిలినవన్నీ అన్నపు మెతుకుల సందుల్లోకి జొరబడ్డాయి. వేళ్లతో కెలికితే చచ్చిపోతున్నాయి.

సద్దిమూటను చెట్టుకింద పరిచింది.

ఆకులోని పచ్చడి తీసి అన్నం మీద కుదిర్చింది.

చేతులు కడుక్కొని వచ్చి కూచున్నాడు ఓబన్న. ఎ్రఱ్రచీమల్ని పట్టించుకోలేదు అతను. పచ్చడి కలుపుకొని పిడచలు చేసి మింగుతున్నాడు.

అక్కడక్కడా అన్నంలో ఇరుక్కొని వున్న ఎ్రఱ్రజీమల్ని ఏరి పళ్లెం అంచులకు కరిపిస్తూ వున్న పిల్లల్ని చూసింది బాలమ్మ. మజ్జిగ పోసి కలిపినపుడు మరీ ఎక్కువగా కన్పించి సంకోచిస్తోంటే చెప్పింది -" ఎ్రఱ్రజీమలు కండ్లకు మంచిదిలే. తినండి.." అని.

భోజనం తర్వాత చెట్టు మొదలుకు ఆనుకొని బీడీ ముట్టించాడు ఓబన్న.

పిల్లల కోసం తనుమాత్రం అలాగే కూచునివుంది.

అంతలో ఏదో సరసరమని సడి. సన్నని మాటలు గాల్లో తేలుతూ తమకేసే వస్తోన్న సవ్వడి. 'సుడిగాలేమో' అనుకొంది మొదట. మనుషులేనని అర్థమయ్యేసరికి పరిశీలనగా చూసింది.

వాళ్లెవరో పోల్చుకొన్నాక అన్నం చేత్తోనే పైట సవరించుకొంటూ మొగునికేసి చూసి" చెన్నార్డి మామ వస్తాండు" అంటూ చిన్నగా చెప్పింది.

తలెత్తి నిటారుగా అటు చూశాడు ఓబన్న. కొడుకుతో కలిసి వస్తోన్న చెన్నారెడ్డి కన్పించగానే దమ్ము మీద దమ్ము రెండుదమ్ముల్లో బీడీని పీల్చి ముక్కను మట్టిలో నలుపుతూ లేచి నిల్చున్నాడు.

రెండు చేల అవతల రోడ్డుమీద ఎండలో మెరుస్తూ కన్పిస్తోంది వాళ్లు దిగివచ్చిన కారు.

"బాగుండావా చిన్నాయనా! కడపనించేనా వచ్చేది? శ్రీధరన్నా బాగుండావా? చాన్రోజులైంది రాక..." పలుకరించాడు.

"ఏమ్మే తగ్గిపోయినట్టుండావే! సంసారమంతా నీనెత్తినేసి యీడు పై తిరుగుల్లకు మల్లుకొన్నెడా ఏంది?" పలుకరింపుల్లో భాగంగా బాలమ్మకేసి చూసి నవ్వుతూ అన్నాడు చెన్నారెడ్డి.

చిన్నగా నవ్వి తలొంచుకొని "అత్త బాగుందా మామా!" అడిగింది ఆమె.

బాలమ్మ మొహంలోని సిగ్గులాంటి భావమేదో శ్రీధర్‌కు ముచ్చటగా అన్పించింది. ఓబన్న తనకన్నా పెద్దవాడయినప్పటికీ తనను 'అన్నా' అని సంభోదించటం వింతగా తోచింది.

ఆదరా బాదరా కళ్లంలోకెళ్లి వరిగడ్డి కప్పి వుంచిన మంచాన్ని తెచ్చి చెట్టుకింద వాల్చాడు ఓబన్న.

శ్రీధర్ మంచమ్మీద కూచున్నాడుగాని చెన్నారెడ్డి అక్కడ నిలబడలేదు.

ఐదెకరాల చేనికేసి సుదీర్ఘంగా చూశాడు.

నాలుగెకరాల పత్తిపైరు పీకి సేద్యం చేసి వుంది. గుంటకపాసి తయారుచేసి పెట్టివుంది. పొద్దుతిరుగుడు విత్తేందుకు సిద్ధమై వుంది.

ఎకరా వరి కోశారు. కళ్లం పని కూడా పూర్తయినట్టుంది.

తెగుళ్లవల్ల పత్తి దిగుబడి దారుణంగా పడిపోయి పెట్టుబడులు కూడా దక్కలేదని రైతులంతా ఏడుస్తున్నారు.

ఓబన్న అదృష్టం. నాటిన ఎకరా వరి అయినా బాగా పండింది. రాలిన వడ్లరాశిని చూస్తోంటే ముప్పై బస్తాల దాకా అయ్యేట్టుండాయి.

చేని గట్టు మీదుగా నడవసాగాడు.

అక్కడక్కడా చేలో బైటబడిన పట్టెడులావు రాళ్లను వంగితీసి గట్టుమీద వుంచాడు. గెనిమల మీద పెరిగిన కంపమొలకల్ని వేర్లతో సహా పీకేందుకు ప్రయత్నించాడు. ఒక్కోచోట గనిమను సుదీర్ఘంగా పరిశీలించి మరీ ముందుకు సాగాడు. ఐదెకరాల చేను చుట్టి వచ్చేసరికి ఆయనకు గంటకు పైగా పట్టింది. బోరుబావి వద్ద మోటరును, స్టార్టర్‌ను పరిశీలించాడు. మోటారుచుట్టూ పెరిగిన జిల్లెడు, తంగెడు, చెట్లను చూసి చిరాకు పడ్డాడు. వంకగట్టు మీది వేపచెట్ల రెమ్మలన్నీ విరిచి వుండటం గమనించి ఆవేదన చెందాడు.

"ఒరే ఓబన్నా! మంచి సేద్దిగానివని పేరుండె నీకు. మంచి రైతువనే అనుకొంటి. ఇదేందిరా యిట్ట జేస్తివి?" అన్నాడు.

ఆయనకేసి ఆశ్చర్యపోతూ చూశాడు ఓబన్న.

"చేలో రాళ్లు తేలితే వాటిని బైటకు మొయ్యకుండా మొండిగా దున్నేవాడు వాడేం సేద్దెగాడురా! గెట్లమీద కంపమొలకలు పీకి పారెయ్యకుంటే మనసొప్పుతాదా? బోరుచుట్టూ తంగేడు చెట్లు, జిల్లేడుచెట్లు మాన్లయితండాయే! ఎట్ట సూడబుద్ధయిందిరా! తూరుప్పక్క గెట్టును సుబ్బిగాడేమో లోపల్లోపల పొరగదున్నుతుండాడే. గమనించినావా! నీకు చేను గుత్తకిచ్చినామంటే మేము రోజూవొచ్చి ఇవన్నీ చూసుకొనేందుకు కాదు నాయినా! నీ స్వంత పొలం మాదిరి చూసుకోవాల..." చెబుతున్నాడు.

చెవుల్లోంచి ఇయర్ ఫోన్స్ తీశాడు శ్రీధర్.

తను తనతండ్రితో కలిసి చిన్నతనమంతా యీ పొలాన్ని తయారు చేసేందుకు ఎంత అగచాట్లు పడిందీ వివరించాడు చెన్నారెడ్డి. రాళ్లన్నీ ఏరి మోసిమోసి తల బొప్పి కట్టిందనీ, వంకపక్క గుట్టలన్నీ తాము ఏరిపోసినవేననీ చెప్పాడు. విధిలేని పరిస్థితుల్లో తాము టౌన్లో సంసారం పెట్టవలసి వచ్చిందనీ, శరీరం అక్కడున్నా తన మనసంతా ఇక్కడే ఉంటుందనీ ఆర్ద్రంగా పలికాడు. వంకగట్టునున్న మామిడి చెట్టును కంటికి రెప్పలా చూసికోమన్నాడు. దాని పండ్లరుచిని చాలాసేపు పొగిడాడు. కాయలు దించేటపుడు తను తప్పక వస్తానన్నాడు.

సరిగ్గా తూరుపు పారని గింజల్ని చేటకెత్తి గాలితోలినపుడంతా పైకెత్తుతున్నాడు ఓబన్న.

ఊడుస్తూ, కుప్పదోస్తూ కళ్లం పని చేసికొంటోంది బాలమ్మ.

పిల్లలిద్దరూ రేగుచెట్లలో వున్నారు.

పొద్దు దిగువాలు బడింది.

"నాకీ పొలం మీద అంతులేని మక్కు. దీంట్లో పండిన వడ్ల బియ్యంతో బువ్వజేసుకొని తింటేనే తృప్తి. ఆ మెతుకులు గొంతులోకి దిగినప్పుడంతా యీ గెట్లమీద కూచుని అరచేతిలో సంగటి ముద్ద పెట్టుకొని తిన్నెట్లే వుంటది. ఈ వంక చెలిమల్లో నీళ్లు తాగినట్లే వుంటది." పరవశంతో చెబుతున్నాడు చెన్నారెడ్డి.

ఓబన్న వింటున్నాడు.

పొలంమీదా, పంటలమీదా, ఇంటిమీదా, పల్లెదనంమీదా నాన్నకున్న అనుబంధం శ్రీధర్‌కు కొత్తేమీకాదు. పల్లెమాండలికంలోకి దిగిన ఆయన మాటల శైలిని కూడా గమనిస్తున్నాడు.

తనెప్పుడూ వీటికి దూరమే. చిన్నప్పటి నుంచే ఇంగ్లీషు మీడియం చదువుల పేరుతో తనను పల్లెకు దూరంగానే పెంచాడు నాన్న. పదేళ్ల క్రితం ప్రమోషన్ రీత్యా ఆయన కూడా టౌన్ చేరాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పన్జేస్తోన్న తనను హఠాత్తుగా ఇప్పుడు పల్లెకు పిల్చుకు రావటంలో ఆయన ఉద్దేశ్యమేమిటో అర్థం కాలేదు.

"ఇన్నేండ్లయింది టౌనుజేరి - నేనెప్పుడూ మార్కెట్టులో బియ్యం కొని తినలే. నా పొలంలో పండినవే. నా పొలం సాగుచేసే రైతులు ఒక్క ఎకరన్నా వరి నాటాల్సిందే. నాకు సరిపోయేన్ని వడ్లు ఇవ్వాల్సిందే. అది ముందే ఒడంబడిక. ఏరేటుంటే ఆరేటుతో గుత్త లెక్కలోకి చెల్లేసుకొంటాను." చెబుతూ "ఒరే ఓబన్నా! నీపంట పండిందిలేరా! యీ యేడాది వడ్లధర మండిపోతాంది. బస్తా తొమ్మిదొందలదాకా రేటు పలుకుతాంది. ఎకరానేలలోనే ముప్పయివేల రూపాయలొచ్చే.." అన్నాడు.

"ఏం పంటలే చిన్నాయనా! బోరునీళ్లన్నీ వరిమడికే సరిపాయే. నాలగెకరాల పత్తి తెగుళ్లతో నాశనమయె. పెట్టుబడికి కూడా గతిలేకపాయె" ఓబన్న తన కష్టాలు చెప్పుకొంటున్నాడు.

శ్రీధర్ మనస్సులో పొలం గుత్త, పంట దిగుబడి, రైతుకు మిగులు గురించిన గణన ఒకటి చకచక జరిగిపోతూవుంది. ఎకరాకూ ఐదువేలవంతున ఐదెకరాలకు గుత్త డబ్బు ఇరవై ఐదువేలు. ఈ కారు నాలుగెకరాలు నష్టపోయినాడనుకొన్నా ఒక ఎకరా దిగుబడిలోనే గుత్తడబ్బు వచ్చె. రెండవకారు ఐదెకరాల ఫలితం వుందిగదా! మొదటికారు ఐదెకరాలు పండివుంటే..? నిజంగానే రైతుకు ఇంత ఆదాయం వస్తోందా!

నాన్నను అడిగాడు మెల్లిగా.

చెన్నారెడ్డి మందహాసం చేశాడు. "అదృష్టవశాత్తు ఆ ఒక్క ఎకరా అయినా వీడికి పండింది. ఇరుగుపొరుగు చేలు చూసినావు గదా! గింజల బరువుతో వంగివుండాల్సిన వరి ఎన్నులన్నీ నిటారుగా నీలుక్కొని వున్నాయి. పైరంతా మాడిపోయి వుంది. వైరస్ దెబ్బ.. నువ్వనుకొన్నట్లు పొలం మీద అంతంత ఆదాయమొచ్చే మాత్రమయితే ఇన్ని తరాలుగా రైతులంతా గట్టికొంపలేక, సరైన తిండిలేక ఎందుకింత అధ్వాన్నంగా బతుకుతారు?" అంటూ మెల్లిగా చెప్పాడు. "ఎకరా వరి పండేసరికి ఎంతలేదన్నా పదివేలు ఖర్చయివుంటది."

వాళ్ల మాటలు సరిగ్గా విన్పించలేదు బాలమ్మకు కానీ ఆమెకు ఓవిషయం

స్పష్టంగా అర్థమవుతూ వుంది - తాము ఒక కారు ఫలితం తీసికొన్నారు కాబట్టి సగం గుత్తడబ్బయినా చెల్లేయాలి. అంటే పద్దెదు బస్తాల వడ్లు కొలిచి యివ్వాలి.

రాశిలో సగం కంటే ఎక్కువే మాయమవుతోన్నట్లుగా అన్పించి కడుపులో వేదన రగిలింది బాలమ్మకు. కాగు పిగిలినట్లు, గాదె పగిలినట్లు, గరిసె పొగిలినట్లు ఏవేవో స్పష్టాస్పష్ట దృశ్యాలు.

రూపాయలు పండితే ఇంటి మగాడి కళ్లు మెరుస్తాయి. తిండిగింజలు పండితే ఇల్లాలి కళ్లు మెరుస్తాయి. ఎన్ని రూపాయలు పండినా ఆడమనిషి పిడికిలి నిండదు. ఆ రూపాయలు ఆమెదాకా దొర్లిరావు. ఇంటినిండా గింజల రాశులుంటే ఇల్లాలి పెత్తనం సాగినట్లే. చీటికి మాటికి మగాణ్ని అడగాల్సిన పనుండదు. ఉప్పుకు పప్పుకు, ఊరగాయకు, కూరగాయకు, పిల్లల ఏడుపులకూ ముసిలోల్ల నోటి తడుపులకూ... వేటికీ.... అన్ని అవసరాల్నీ గింజలే తీరుస్తాయి.

గుత్తకు పోను మిగిలినవి తమ అవసరాన్నయినా తీర్చగలవో లేదోనని దిగులు పడుతూ వుంది ఆమె.

"కంది విత్తినా బాగుండేది సిన్నాయనా! పత్తినాటి నాశినమైపోతి. ఎంత ఫవర్ మందులు కొట్టినామో తెలుసునా? ఆ ఫవర్‌కు సెట్టంతా గిడసబారి పోయిందేగాని తెగులు యిడ్సలేదే. ఎరువులకూ పురుగుమందులకూ తడిసి మోపెడైంది. అప్పు మిగిలింది. ఈ కారు పొద్దుతిరుగుడు యిత్తనాలకూ, ఎరువులకూ ఎవుని కాల్లు పట్టుకోవాలో తెలీదంలే.." వడ్లకుప్ప ఎగదోస్తూ అన్నాడు ఓబన్న.

అతనికేసి తదేకంగా చూశాడు చెన్నారెడ్డి.

"గుత్తలెక్క రొండోకారుకు సెల్లేజ్జామనుకొటే నీకు తిండిగంటలు కావాల్సొచ్చే. నా సగం వడ్లన్నా అమ్మితే ఎడగారు సేద్దేనికి పెట్టుబడి వస్పాదనుకొంటే - "పిల్లోల్లకేం పెట్టాల?" అని దానిపోరు.." పెండ్లానికేసి చూస్తూ అన్నాడు. అతని గొంతులో ఆవేదనకు తోడు ఏదో అసహనం.

తలొంచుకొని పస్తేసుకొంటూ వుంది బాలమ్మ.

చెన్నారెడ్డి ఆలోచనల్లో పడ్డాడు.

వ్యవసాయాన్ని గురించి తను వేసిన లెక్కలకీ, అందులోని వాస్తవానికీ తేడా ఏమిటో అర్థమవుతూ వుంది శ్రీధర్‌కు.

ఓబన్న తనగోడు ఇంకా వెళ్లబోసుకొంటూనే వున్నాడు.

"నీ ఆలోచన కరెక్టురా అబ్బీ!" మంచమ్మీద నిటారుగా అవుతూ చెప్పాడు చెన్నారెడ్డి. "రెంద్రూపాయల కిలోబియ్యం దొరుకుతుండాయి గదా! వాటికి తోడు తగ్గొడ్లు కొనుక్కోడమో, ఒక అర్దెకరా ఎడనారు సొద్దనాటు కోడమో చేస్తే కాలం గడచిపోద్ది. ఈ వడ్లు అమ్ముకొంటే యీకారు పెట్టుబడికి సరిపోతది."

"నువ్వు జెప్పింది నిజమేననుకో... అయినా మసూర వడ్లు పండించుకొని స్టోరు బియ్యం యాడతింటావు లీ.."

"ఒరె తిక్కోడా!" అంటూ నవ్వాడు చెన్నారెడ్డి." ఏదిమంచి ఏదిచెడు? పండించుకొంటాం కాబట్టి ఆ సంగతి మనకు తెలుసు. టౌన్లో వుండే మా పెద్దపెద్ద ఆఫీసర్లకేం తెలుసు. ఈ స్టోరు బియ్యాన్నే మూడుసార్లు పాలిష్ పడితే సన్నబారి మసూరబియ్యం అవుతాయి. కల్తీచెయ్యడం.. సంచుల్లో నింపడం.. ఫైన్ రైస్ అని

అమ్మడం.. ఎలక్ట్రిక్ కుక్కర్లు వొచ్చినాయి. ఏ బియ్యమైనా మెతుక్కు మెతుక్కు అంటకుండా అన్నమయితది. గిరాకీ మహదేవ. రేటొచ్చిందంటే కల్తీలేని బియ్యం ఎవ్వరికీ దొరకవు."

తలెత్తి చెన్నారెడ్డి కేసి అదోలా చూసింది బాలమ్మ.

రైతుగా పుట్టినవాడు ఎట్లా బతకాల్సిందీ చెబుతున్నాడు చెన్నారెడ్డి. రైతు తాత్వికత వివరిస్తున్నాడు. కష్టం చేయటంలో ఎంత ఉత్సాహాన్ని చూపుతారో ఖర్చుచేయటంలో అంత పొదుపును పాటించాలిట. జిహ్వాకు అమిత మాధుర్యాన్నిచ్చే నేతిబొట్టును కూడబెట్టి వ్యాపారులకు అమ్మి ఆ సొమ్ముకు ఉప్పో మిరపకాయో తెచ్చుకొంటూ వాటితోటే ఓ పొగాకు కాడ కూడా తెచ్చుకొని దవడన పెట్టుకొని తెల్లార్లూ గడిపిన జీవితాన్ని గురించి చెబుతున్నాడు. పుట్లు పుట్లు వేరుశెనక్కాయలు పండించి పచ్చడి కోసం కూడా దాచుకోకుండా అమ్ముకొని ఇంటిఖర్చులు పూడ్చుకొంటూ చింతతొక్కో మిరపకారమో నల్చుకొని ముద్ద సంగటి మింగిన వైనాన్ని గుర్తుజేస్తున్నాడు.

చివర ముక్తాయింపుగా అన్నాడు "నా మాటని అమ్మేసుకోరా!"అని.

బాలమ్మ గుండెల్లో సన్నని దడ మొదలైంది.

ఈ వడ్లమీద ఎంత ఆశపెట్టుకొందనీ!

వచ్చే శనివారమే ఓ పడివడ్లు దంచి బెల్లం బువ్వవండి సోంబువ్వగా నైవేద్యం పెట్టి వారం చెయ్యాలనుకొంది. తర్వాతనే కూలీలకు వడ్లు కొలవటం. అది ఆచారం కూడా.

కానీ - కళ్లంలో వడ్లన్నీ కళ్లముందే మాయం కాబోతుండటాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

"అమోవ్.. ఓమా.." మెల్లిగా తల్లిదగ్గరకొచ్చి గోముగా మూలుగుతున్నాడు పిల్లాడు

కూతురు కూడా వచ్చింది.

వాళ్లను గమనించాడు చెన్నారెడ్డి

"ఏమొరే! పిల్లోల్లను బడికి పంపేదం లేదా!" అడిగాడు.

"ఎందుకు లేదు చిన్నాయనా! ఇయ్యాల మేలుకల్లమనీ దొబ్బినా యిడ్సిపోలే. గింజలు పెట్టించకపోయి కొనక్కతినొచ్చునని ఆశ" చెప్పాడు.

పిల్లలో చేతిలోని కొంగు విడిపించుకొని వాళ్లను పనికి అడ్డపడకుండా పక్కకు నెడుతూ "వడలగంప రానీండి.." అంది బాలమ్మ మెల్లిగా.

"సెట్టి రాడంటమా! కల్లంకాడ కూలోల్లు దండిగా వుంటే గంపెత్తుకొని వస్చాడంట. యీడికి రాడంట.." చెప్పి మూలగటం మొదలెట్టింది పాప.

మేలు కళ్లం రోజు సెట్టిగారు అదేపనిగా వదలగంప నెత్తిన పెట్టుకొని కళ్లం కాడికి వచ్చే దృశ్యం చెన్నారెడ్డికి గుర్తొచ్చింది. గంపెడు వడ్లు తక్కువ కాకుండా తీసుకపోతాడు. ఇబ్బడి ముబ్బడిగా వడ్లు తీసికొంటాడు. ఒక విధంగా అది దోపిడీ తనమే. ఆ విషయాన్నే ఓబన్న చెప్పాడు. వాళ్లట్లా రైతుల కష్టాన్ని దోచుకొనే షాహుకార్లు అయ్యారన్నాడు.

చేటెడు వడ్లయినా గుడ్డలో కట్టి పిల్లల నెత్తిన పెట్టి పంపుదామనుకొంది బాలమ్మ. చెన్నారెడ్డి మాటలతో ఆగిపోయింది.

పిల్లల్ని దగ్గరకు పిల్చి పదిరూపాయాలు వాళ్ల చేతుల్లో పెట్టి "కొనుక్కోపోండి" అన్నాడు చెన్నారెడ్డి.

ఓసారి తల్లికేసి ఎగాదిగా చూసి అక్కణ్నించి కదిలారు వాళ్లు.

వడలగంప మోసాన్ని గురించి చెన్నారెడ్డి ఇంకా చెబుతూ వుంటే బాలమ్మ అంది "పని బాటలోల్లు, సిల్లరంగలోల్లు కల్లాలను ఆసించుకోనుంటారులే మామా! అది మామూలే లే. మీరు మాత్రం లోగడ వడలగంపకు వడ్లు పోసిందరూ?" అంది.

"మస్తులుగా పోసినం. అప్పుడు తెలీలే.. ఆ మోసం ఇప్పుడర్థమవుతా వుంది" చెప్పాడు. చెన్నారెడ్డి కేసి తదేకంగా చూసింది ఆమె.

"సేద్యంతో సంబంధం తెంచుకొన్నాక అందులో లొసుగులు ఇప్పుడు తెలిసి వస్తాందయేమో!

పిల్లలు వడలు కొనుక్కోరాలేదు. చాక్లెట్లు, బిస్కెట్లతో వచ్చారు.

నేరుగా తల్లిదగ్గరకు వెళ్లి చూపించారు.

కళ్లెత్తి వాటికేసి ఓమారు చూసి తన పనిలో నిమగ్నమైంది ఆమె.

కూతురు తన చేతిలో చాక్లెట్ పెడుతోంటే మౌనంగా తిరస్కరించింది. చేటలో పెడితే తీసి పక్కన పడేసింది.

వడ్ల అమ్మకాన్ని చర్చించుకొంటున్నారు ఓబన్న చెన్నారెడ్డిలు.

అతని పాలి వడ్లు కూడా తనే కొనుక్కోపోతానన్నాడు చెన్నారెడ్డి. ఎరువులు విత్తనాలు తన బంధువు అంగట్లో ఇప్పిస్తానన్నాడు.

కళ్లం అంచుల్లో రాళ్లు మట్టి పెళ్లలు కలిసిన వడ్లను చేటలోకి తీసికొని నేముతూ రాళ్లు ఏరుతూ వున్న బాలమ్మకు వాళ్ల మాటలు వింటోంటే ఒళ్లంతా శైత్యం పోస్తున్నట్లుగా అన్పించింది. మెదడంతా ఖాళీ అవుతోన్నట్లూ, చూపులు క్రమేణా మసకబారుతోన్నట్లూ, చేటలో వడ్లు అలుముకు పోయి కనబడనట్లూ అన్పించి చేట నేలమీదకు జారవిడిచింది.

"పిల్లోల్లకు ఏంబెట్టి సాకుతాడో యీనాబట్ట..." కసిగా గొణిగింది.

కొడుకు బిస్కెట్ ఇవ్వబోతే విసురుగా వెనక్కు నెట్టింది.

కళ్లం అంచులకు ఆవైపు కుక్క ఒకటి తారట్లాడుతోంటే తుంటకట్టెతో వెంపర్లాడింది.

"చేసి చేసి చేతులు పడిపాయె. బొక్కెడు బువ్వతినేందుక్కూడా లేకుండా సేస్తాందేమో నాబట్ట!" అంటూ గంప ఎత్తి దూరంగా విసరింది.

పరిస్థితి సూచాయగా అర్థమైంది చెన్నారెడ్డికి.

"ఏమొరేమరి! ఖాళీ సంచులు పంపిస్తా.." అంటూ లేచి గెట్టుకేసి నడిచాడు.

ఆమె మానసిక వేదన శ్రీధర్‌కు కూడా కొంతలో కొంత తెలిసివచ్చింది. నాన్నతోటి నడుస్తోంటే వెనకనించి ఆమె ఏడుపు గొంతు సన్నగా ఎగిసివస్తూ విన్పిస్తోంది.

"ఈ వడ్లు మనం కొనకుంటేనే బావుందేమో నాన్నా!" మెల్లిగా అన్నాడు.

"ఎవడోకడు కొంటాడుగదా!"

"అప్పుడు ఆయమ్మ ఏడుపులు మనమీద ఉండవు గదా! మనమేదో బలవంతంగా దోచుకుపోతున్నట్లూ.. ఫ్రీగా ఏమీ రావటం లేదు గదా! మనీ పే జేస్తున్నాం గదా! యీ గొడవలెందుకూ?'

"ఆ పిల్ల ఏడుపు ఆ పిల్లదిలేరా! ఎటూ అమ్ముతున్నారు కాబట్టి మనచేలో వస్తువు కొనే హక్కు మనకుంది. అవసరం కూడా వుంది. గుత్త డబ్బు చెల్లేసికోవచ్చు గదా!"

"ఎరువులు ఇప్పిస్తానంటివి?"

"షాపు వానికి రికమండ్ చేస్తాం. వాళ్ళు అప్పిస్తారు. ఎడగారు ఏం పండితే దాన్ని తీసప్పోయి బాకీలోకి జమేసుకొంటారు. మన గుత్త లెక్క మనకు పూర్తిగా వచ్చినట్లుంది."

ముందు వెళుతూవున్న తండ్రికేసి తదేకంగా చూశాడు.

"బాగా పండితే గుత్త ఇస్తారు. పండకుంటే ఏడుపు మొగం పెట్టి చిన్నలై పెద్దలై నగానికి కోత బెడ్తారు. రెండు మూడేండ్లు నేనిట్లా నష్టపోయినా. అందుకే ఏదొక ఉపాయంతో గుత్తలెక్క రాబట్టుకొంటున్నా. చాలా వరకూ పండిన వడ్లనే జమేసుకొంటున్నా. సెంటిమెంటులేదని కాదు. సెంటిమెంటు కంటే ఆర్థిక భావనే ఎక్కువ... తప్పలేదు మరి!" కొడుకు ముందు అంతరంగాన్ని ఆవిష్కరించాడు.

మౌనంగా వింటూండిపోయాడు శ్రీధర్.

"ఇవన్నీ చూడాలనే.. తెలుసుకొంటావనే నిన్ను పిల్చుకొచ్చింది."

గట్టిగా నిట్టూర్చి తండ్రికేసి చూశాడు. "నాకిదంతా నచ్చలేదు నాన్నా! తెలుగు గంగ వచ్చింది కాబట్టి ఎకరా లక్షన్నరదాకా రేటు వుందంటివి. సంవత్సరానికి ఎకరాకు ఐదువేలు గుత్తంటే పావలా వడ్డీ కూడా రాదు. దానికోసం ఇన్ని ప్లాన్‌లు, ఇన్ని ఏడుపులు, ఇంత స్ట్రగుల్... అమ్మేసి బ్యాంక్‌లో వేసినా ఇంతకన్నా ఎక్కువ ఇన్‌కమ్ వస్తుంది గదా! లేదూ - సిటీలో ఫ్లాట్ తీసికొంటే మేలుగదా!"

కొంత మౌనం తర్వాత చెప్పాడు చెన్నారెడ్డి "నేను ఆలోచించక కాదు. ఈ విషయంలో మాత్రం కొంత సెంటిమెంటే. నా వేర్లేవో ఇక్కడ పాతుకొని వున్న ఫీలింగ్ వుంది. ఎప్పుడో మన పూర్వీకులు సంపాదించిన ఆస్తి. ఎన్ని తరాల్నుంచో మనల్ని బతికిస్తూ వున్న పొలం." అంటూ కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత" గుత్తలెక్క కాకుండా ఇంకొంత ఆదాయం కూడా వస్తాందిలే. 'అన్నాడు. ఈ పొలం మీదా ఇంకొంత బరక పొలం మీదా కలిపి రెండు క్రాప్‌లోన్లు తెచ్చినంలే - యాభైవేలు లక్షరూపాయలకు. కరువు ప్రాంతం కాబట్టి ప్రతియేడూ పంటనష్టం కింద ఇన్సూరెన్స్ ట్వంటీ పర్సంటో థర్టీ పర్సంటో వస్తంది. పాతిక వేలకు తగ్గదు."

ఆశ్చర్యంగా చూశాడు శ్రీధర్. "క్రాప్ డామేజి ఇన్సూరెన్స్ పంట పండించే వానికి గదా రావాల్సింది. వాళ్ళు గదా పెట్టుబడి పెట్టి కరువుల వల్ల నష్టపోయేది?"

"పాస్‌బుక్కులు మనపేరుమీదే వుంటాయి మనమే లోను తెచ్చుకొంటాము. ప్రీమియం కూడా మన పేరుమీదే. ఇన్సూరెన్స్ మనకే వస్తుంది. పొలాన్ని దున్నలేక కోరుకో గుత్తకో ఇచ్చేవాళ్లంతా ఇంతే --- ఇట్లే చేస్తారు."

"ఇంత ఫ్రాడ్ చేసినా అర్ధరూపాయి వడ్డే. పొలాలు అమ్మి సొమ్ము చేసిపోవటమే నా దృష్టిలో తెలివైన పని". చెప్పాడు శ్రీధర్.

పొలం కేసి తలెత్తి చూశాడు చెన్నారెడ్డి. ఆ చూపులు అట్లా అట్లా కదిలి కళ్లందాకా వెళ్లి వెనుదిరిగాయి.

కళ్లంలో బాలమ్మ ఏడుస్తూ తిడుతూనే వుంది. ఒక పెద్ద సుడిగాలి వచ్చినట్లూ, కళ్లంలో గింజలన్నిటినీ ఎత్తుకుపోతోన్నట్లూ అనిపించి గుండెలు బాదుకొంది. పిల్లల నోరు తీపిజేసేందుకు కొత్త వడ్లతో నాలుగు వడలు కొనలేని తన అశక్తతను తిట్టుకోసాగింది. కాశినాయన స్వామికి మీదు వడ్లు తీయలేనందుకూ, స్వామిబువ్వ

వండి నైవేద్యం పెట్టలేనందుకూ రోదించసాగింది. ఆ శోకంలోనే కోపం ముంచుకొచ్చి ఎదురుగా నిలువెత్తి సుడిగాలి ఉన్నట్లుగా భ్రమించి 'ధూ ధూ ధూ సావు నా సవితీ!' అంటూ పాత చెప్పుమీద ఎంగిలి వూసి విసరింది.

అది చెన్నారెడ్డి వెళ్లిన దిశగా ఎగిరిందో, తన మొగుని దిశగా ఎగిరిందో ఆమె పట్టించుకోలేదు.

● ఆదివారం - ఆంధ్రజ్యోతి, 14-06-2009 ●